నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 1 ఏప్రిల్ 2024 | SANGAREDDY

## సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి

- ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై స్పందించాలి

సంగారెడ్డి/మెదక్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సి-విజిల్ యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, మెదక్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడే వాటిని లైవ్‌ఫొటోలు, లైవ్ వీడియోలను సి-విజిల్ యాప్ ద్వారా తీసి పంపాలని సూచించారు. అందిన ఫిర్యాదులపై వంద నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని, లైవ్‌ఫొటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉంచాలని, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వా రా లొకేషన్ నమోదవుతుందని, సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత కామెంట్స్ చేసినా, పార్టీ అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు లాంటి వివరాలను, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై లైవ్‌ఫొటోలు, వీడియోలు సి-విజిల్ యాప్ ద్వారా పంపాలని సూ చించారు. సి-విజిల్ యాప్‌ను తమ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. 1950 టోల్‌ఫ్రీ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, సి-విజిల్ యాప్ ఫిర్యాదులపై మెదక్ కలెక్టరేట్‌లో 24గంటలు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, సెల్‌నంబర్లు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

## ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా

మెదక్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## తోటపల్లి యువతికి యూకే టైటిల్

బెజ్జంకి, మార్చి 31: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన ప్రమోద్‌రావు, సరిత దంపతుల కుమార్తె సుహానీరావు యూకేలో మెరిసింది. సుహానీరావు మిస్ టీన్ గెలాక్సీ పేజెంట్ యూకే టైటిల్‌ను గెలిచి మొదటి దక్షిణాసియా వాసిగా నిలిచింది. దీంతో అమెరికాలో జరిగే గెలాక్సీ ఇంటర్నేషనల్ పోటీల్లో యూకే తరఫున ఆమె ప్రాతినిధ్యం వహించనున్నది. ఈ నెలలో యూకేలోని వారింగ్టన్‌లోని పార్ హాల్ లో యునైటెడ్ కింగ్‌డమ్ నలుమూలల నుంచి 25 మంది యువతుల ఫైనలిస్టులతో పోటీపడి టైటిల్ సాధించింది. ప్రమోద్‌రావు, సరిత కుటుంబం 14 ఏండ్ల క్రితం యూకే వెళ్లి బకింగ్‌హామ్‌షైర్‌లో స్థిరపడింది. భరతనాట్యంలో డిప్లొమా చేసిన సుహానీరావు నృత్యకారిణిగా స్థానికంగా మంచిపేరు పొంది నాట్య కళా జ్యోతి బిరుదు పొందింది. బీచ్ క్లీనప్, బయోడిగ్రేడబుల్ ప్యాడ్ డొనేషన్ క్యాంపెన్ వంటి కార్యక్రమాలు నిర్వహించి పేదరికాన్ని నిర్మూలించడం లక్ష్యంగా పనిచేస్తున్నది. ఆగస్టులో యూఎస్‌ఏలోని ఫ్లోరిడాలోని ఓర్లాండోలో జరిగే గెలాక్సీ ఇంటర్నేషనల్ పేజెంట్‌లో యూకే తరుపున ఆమె ప్రాతినిధ్యం వహించనున్నది. అంతర్జాతీయ కిరీటం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతులతో పోటీ పడనున్నది. తోటపల్లికి చెందిన యువతి యూకేలో ఉత్తమ ప్రతిభ కనబర్చి టైటిల్ సాధించడంపై గ్రామంతో పాటు మండలవాసులు అభినందిస్తున్నారు.



టైటిల్ సాధించిన యువతి సుహాని

## కొమురెల్లి మల్లన్నకు కోటిదండాలు

- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- 11వ ఆదివారం 50వేల మంది భక్తుల దర్శనం


రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, మార్చి 31 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాల 11వ ఆదివారం సందర్భంగా 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం నుంచే మల్లన్న క్షేత్రానికి భక్తులు రాక ప్రారంభమైంది.ఆదివారం వేకువజామునే నిద్రలేచి కోనేరులో స్నానాల అనంతరం స్వామిని దర్శించుకున్నారు. సాధారణ దర్శనం నాలుగున్నర గంటలు, ప్రత్యేక దర్శనం మూడున్నర గంటలు పట్టింది. భక్తులు పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.బోనాలు తీశారు.గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టారు. సంతానం కలగాలని మరికొందరు ఒల్లుబండ పూజలు చేశారు. రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టి స్వామిని వేడుకున్నారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలు అందించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగెడపల్లికి చెందిన గడ్డం దేవయ్య(భీవండి) రూ.50,116 విరాళం అన్నదాన సత్రానికి అందజేశారు. ఆలయ ఈవో ఎ.బాలాజీకి ఆయన నగదు అందజేసి రసీదును పొందారు.కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


డెడ్‌స్టోరేజీకి చేరిన రంగనాయక సాగర్


నీళ్లు లేక ఎడారిని తలపిస్తున్న అన్నపూర్ణ రిజర్వాయర్

### అన్నపూర్ణ ప్రాజెక్టే ఆధారం



అన్నపూర్ణ ప్రాజెక్టు మాకు ఆధారం. పోయిన యేడు ఈ కాలంలో అన్నపూర్ణ ప్రాజెక్టు నీళ్లతో మాఊరి చెరువు నింపారు. చెరువులో బాగా నీళ్లు ఉండటంతో పంటలు పండినాయి. ఈసారి చెరువులో నీళ్లలేక బోర్లు ఎండినాయి. నాకున్న రెండెకరాలతో పాటు మరో ఎకరన్నర భూమిని కౌలుకు తీసుకుని వరి పంట ఏసిన. పంట పూర్తిగా ఎండుతోంది. దీంతో నాకు 2.5 లక్షల వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం స్పందించి అన్నపూర్ణ ప్రాజెక్ట్ ద్వారా చెరువు నింపు రైతులను కాపాడాలి.

–ఎలుక సంపత్, రైతు, గుండారం, బెజ్జంకి మండలం (సిద్దిపేట జిల్లా)

# అడుగంటిన ఆశలు

- నీళ్లులేక బోసిపోయిన రిజర్వాయర్లు
- ఎడారిని తలపిస్తున్న అన్నపూర్ణ రిజర్వాయర్
- డెడ్‌స్టోరేజీకి చేరిన రంగనాయకసాగర్
- ఎండిపోతున్న పంటలు.. రైతుల ఆందోళన
- కాంగ్రెస్ పాలనపై అన్నదాతల పెదవి విరుపు

సిద్దిపేట, మార్చి 31(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పాలనలో రిజర్వాయర్లు ఎడారిని తలపిస్తున్నాయి. రిజర్వాయర్ల నిర్వాహణ, నీటిని నింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తయ్యడంతో రిజర్వాయర్లలో నీరులేక బోసిపోయి కనిపిస్తున్నాయి. దీంతో సాగునీరందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. ఎండిపోయిన తమ పొలాలను సెల్ఫీ వీడియోల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరేలా రైతులు సందేశాలు పంపుతున్నారు. కాంగ్రెస్ సర్కారు రైతుల గురించి కనీసం ఆలోచన చేయడం లేదు. ఏ రైతును చూసినా ఆందోళన, ఆవేదన కనిపిస్తున్నది.కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీటికి ఢోకా లేకుండే, పుష్కలంగా సాగునీరు ఇవ్వడంతో ప్రతి గుంటా సాగులోకి వచ్చింది. భూమికి బరువయ్యేలా పంటలు పండాయి. రైతుల జేబుల్లో పది రూపాయలు కనిపించాయి. బీఆర్ఎస్ సర్కారు అందించిన చేయూతతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకున్నారు. సాగు భూముల ధరలు సైతం పెరిగాయి. ఇదంతా గతం. ఇప్పుడు రైతులు ఇబ్బంది పడుతున్నారు. సమైక్య రాష్ట్రంలో ఉన్నటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మెదక్ జిల్లాలో రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరిగేవి.


రంగనాయక సాగర్ ఆయకట్టు రామంచ గ్రామంలో ఎండిపోయిన వరి పొలం

పశువులకు సైతం గడ్డి దొరకక పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. అలాంటి పరిస్థితుల నుంచి కేసీఆర్ దూరదృష్టితో జిల్లా లో పెద్ద ఎత్తున రిజర్వాయర్లను నిర్మించి ప్రతి ఎకరాకు సాగునీటిని అందించారు. దీంతో బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లా పచ్చటి పొలాలతో అలరారింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మళ్లీ నాటి గోస గుర్తుకు వస్తున్నదని రైతులు చెబుతున్నారు.

### రిజర్వాయర్లు ఖాళీ..

బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన రిజర్వాయర్లు నీళ్లు అడుగంటి బోసిపోయి కనిపిస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో ప్రధానంగా నాలుగు రిజర్వాయర్లు ఉన్నాయి. మిడ్‌మానేరు నుంచి సిద్దిపేట జిల్లాలోకి రిజర్వాయర్లకు కాళేశ్వరం జలాలు వస్తాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా, సిద్దిపేట జిల్లాల సరిహద్దులో అనంతగిరి వద్ద అన్నపూర్ణ రిజర్వాయర్‌ను 3.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఐదారేండ్లుగా ఈ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి రెండు జిల్లాలకు సాగు నీటిని అందించారు.మిడ్‌మానేరు రిజర్వాయర్ నుంచి ఈ రిజర్వాయర్‌లోకి నీరు వస్తుంది. అక్కడి నుంచి రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లలో నీటిని నింపుతారు. గత ఎన్నికల ముందు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లాలోని అన్ని రిజర్వాయర్లను పూర్తి సామర్థ్యంతో నీటిని నింపించారు. దీంతో ప్రస్తుత యాసంగి పంటలకు ఉపయోగపడింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఆ రిజర్వాయర్లను నింపలేదు. అన్నపూర్ణ రిజర్వాయర్ సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.84 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. డెడ్ స్టోరేజీకి చేరి ఈ రిజర్వాయర్ ఏడారిని తలపిస్తున్నది. ఈ రిజర్వాయర్ కింద పంటలు ఎండిపోవడంతో రైతులు బోరున విలపిస్తున్నారు.రంగనాయక సాగర్ రిజర్వాయర్ సామర్థ్యం 3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఇది డెడ్ స్టోరేజీకి చేరింది. ఈ రెండు రిజర్వాయర్ల పరిధిలో పంటలు పూర్తిగా ఎండి పోయి రైతుల ఆందోళన చెందుతున్నారు. నాడు కేసీఆర్ ప్రభుత్వంలో జలభాండాగారాలుగా రిజర్వాయర్లు కనిపిస్తే.. ఇవాళ ఎడారిని తలపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉంటే మా పంటలు ఇలా ఎండిపోయేవా? అని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోగా, ఇటీవల వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతిని రైతులకు భారీగా నష్టం వాటిల్లింది.


సిద్దిపేట జిల్లా గుండారంలో ఎండిపోయిన రైతు గైండ్ల బీరయ్యకు చెందిన పొలం

### దెబ్బతిన్న పంటలు..

ఇటీవల కురిసిన వడగండ్ల వానకు ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీగా పంటలు దెబ్బతిన్నాయి. సిద్దిపేట జిల్లాలో 1,794 మంది రైతులకు చెందిన 2,806 ఎకరాల, మెదక్ జిల్లాలో 2,154 మందికి చెందిన 2,766 ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 343 మంది రైతులకు చెందిన 714 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,191 మంది రైతులకు చెందిన 6,286 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగింది. ఉమ్మడి జిల్లాలో ఇంత పంట నష్టం జరిగినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. పంట నష్టం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నా పట్టించుకునే వారు లేరు. మరో పక్క రుణాలు చెల్లించాలని రైతులకు బ్యాంకు వాళ్లు నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం సాగుచేసిన పంటలను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు ఉన్నారు. రెండు రోజులుగా బీఆర్ఎస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పంట పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చుతున్నారు. రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి



రామాయంపేటలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

- కాంగ్రెస్‌వి 420 హామీలు, ఆరు గ్యారెంటీలని మోసం చేసింది..
- బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- మాయమాటలు చెప్పే రఘునందన్‌కు ఓటెయొద్దు
- మనసున్న మంచి వ్యక్తి వెంకట్రాంరెడ్డి
- సాయం చేసే గుణం అతని సొంతం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- మూడు నెలలకే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగు వచ్చింది: ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- ఎంపీగా గెలిపిస్తే సొంత డబ్బులతో సేవ చేస్తా : మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- రామాయంపేటలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం విజయవంతం

రామాయంపేట, మార్చి 31: అసెంబ్లీ ఎన్నికల్లో గ్యారెంటీల పేరుతో పాటు ఇతర అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఓటుతో ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్ జిల్లా రామాయంపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మూడు నెలల పాలనపై ఇప్పుడే ప్రజలకు విసుగు వచ్చిందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను మరిచిపోయారని, ప్రజలు సైతం వారిని మరిచిపోవాలన్నారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మంచి మనసున్న వ్యక్తి అని, ఆయన ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్నతాధికారిగా అనేక పనులు చేశాడని కొనియాడారు.ప్రభుత్వానికి సంబంధం లేకుండా వెంకట్రామిరెడ్డి ప్రజలకు సాయం చేస్తారన్నారు.మాయమాటలు చెప్పే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును ఎవరూ నమ్మరని, ఆయనకు ఈ ఎన్నికల్లో భంగపాటు తప్పదని అన్నారు. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచి హామీలు అమలు చేయకుండా మోసం చేసిన రఘునందన్‌ను ప్రజలు చిత్తుగా ఓడించాలని పద్మాదేవేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### మెదక్‌తో ఎంతో అనుబంధ ఉంది..

**-మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**

మెదక్ ఎంపీ స్థానంలో కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని, కార్యకర్తలందరూ సమష్టిగా కృషిచేస్తే బీజేపీ, కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఎంపీగా గెలిపిస్తే మీతో కలిసి జిల్లా అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. మెదక్ అసెంబ్లీ స్థానంలో పద్మాదేవేందర్‌రెడ్డి స్వల్ప ఓట్లతో ఓడిపోవడం బాధాకరమని, తనను ఎంపీగా గెలిపించి ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీ గెలిస్తే ఎమ్మెల్యే లేని లోటును పూడ్చవచ్చని అన్నారు.తనకు మెదక్ నియోజకవర్గంతో ఎంతో అనుబంధం ఉందని, ఉమ్మడి మెదక్ ప్రజలకు తాను కొత్తేమి కాదన్నారు. జిల్లాలో ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టానని, ఈ ప్రాంత ప్రజల భాగోగులు తనకు చాలా తెలుసన్నారు. అధికారిగా 25 ఏండ్లు పనిచేసిన అనుభవం తనకు ఉందని, ప్రజాసేవ చేసేందుకు 2021లో కలెక్టర్ ఉద్యోగాన్ని త్యజించి అప్పటి సీఎం కేసీఆర్, హరీశ్‌రావు సహకారాలతో ఎమ్మెల్సీగా రాజకీయాల్లో అడుగిడినట్లు వెంకట్రామిరెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్నింటా ముందు వరుసలో నిలిచిందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వ్యక్తిగతంగా అనేక సహాయ కార్యక్రమాలు చేస్తున్నానని, పలువురు అనాథలను అక్కున చేర్చుకుని వారికి అండగా నిలిచినట్లు తెలిపారు. తనను ఎంపీగా గెలిపిస్తే గెలిచిన 9 నెలల్లో మెదక్ ఎంపీ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.2 కోట్ల చొప్పున వెచ్చించి మండలానికో ఫంక్షన్ హాల్ నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇప్పిస్తానన్నారు.పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ కార్యకర్తలు, పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తానని వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. సమావేశంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గజవాడ నాగరాజు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

### మూడు నెలలకే కాంగ్రెస్ పాలనపై పెదవి విరుపు

**-ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**

కాంగ్రెస్ పాలన మూడు నెలల పాలనకే ప్రజలకు విసుగు వచ్చిందని, ఆరు గ్యారెంటీలు ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరిగిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎక్కడకి పోయారని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ప్రశ్నించారు. అలవికాని హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులు ఎత్తేశారని, కాంగ్రెస్‌కు ప్రజల నుంచి నిరసన తప్పదన్నారు. ఒకరిని విమర్శించే ముందు తమ గురించి, తమ పనితనం గురించి ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలుకు భ్రమలు వీడాయని, బీజేపీ తెలంగాణకు ఏమిచేసిందని ఓటేయాలని ఆయన ప్రశ్నించారు.తెలంగాణను, మెదక్ జిల్లాను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ అన్నారు. కేసీఆర్ సంక్షేమ పాలన అందిస్తే, కాంగ్రెస్ మోసపూరిత విధానాలను అవలంభిస్తున్నదని ఆయన విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విస్మరించిందన్నారు. మెదక్ జిల్లాతో ఎంతో అనుబంధం ఉన్న వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సత్తాచాటుదామని క్యాడర్‌కు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి